క్లుప్తంగా

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై వినాయక్ చౌక్‌లో నాటక ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలపై పర్యవేక్షణ ఉంచాలన్నారు. వ్యసనాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మత్తు పదార్థాలు విక్రయించి నా.. సేవించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు కోటయ్య, అనిత, పృథ్వీరాజ్, పూనం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి ఎస్సైగా సాయన్న

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి ఎస్సైగా సాయన్న గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన దుబ్బాక సునీల్ నిజామాబాద్‌కు బదిలీపై వెళ్లారు. నిజామాబాద్ జిల్లాలోని రెంజేల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సాయన్న ఇంద్రవెల్లికి బదిలీ అయ్యారు. మండల ప్రజలకు అందుబాటులో ఉండి అన్ని విధాలుగా సాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి చేయూత

బోథ్: మండల కేంద్రంలోని రాంగనర్ గ్రామానికి చెందిన తాల్సింగ్ అనే విద్యార్థి విజ్ఞాన్ పాఠశాలలో చదువుతోంది. కాగా విద్యార్థికి చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు ఇటీవల కాలిపోయింది. విషయం తెలుసుకున్న పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు గురువారం విద్యార్థిని ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం చేసి ఉదారతను చాటుకున్నారు.

మినీ గురుకులం తనిఖీ

బేల: మండలంలోని సదల్‌పూర్ గ్రామంలోని ఎస్టీ బాలికలు మినీ గురుకులం ప్రాథమిక పాఠశాలలో గురువారం మండల పంచాయతీ అధికారి మహేశ్‌కుమార్ తనిఖీ చేశారు. సరుకుల నిల్వ గది, స్టాకు రిజిష్టర్, విద్యార్థుల హాజరు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరుకులు నిల్వ గది పరిశుభ్రంగా ఉంచాలని, పరిసరాల్లో బ్లీచింగ్ చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య పట్ల పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఖదీర్ హైమద్, పెందుర్ రాందాస్, కొడపే అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కైలాస్‌నగర్: ప్రభుత్వరంగ సంస్థ న్యాక్ ఆధ్వర్యంలో అందించే ఉచిత కుట్టు శిక్షణకు సంబంధించి మహిళలు, యువతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ఏడీ నాగేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ– సీ సర్టిఫికెట్ కలిగిన క్రిస్టియన్లు, ఎస్సీ యువతులు, మహిళలకు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణనివ్వనున్నట్లుగా తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు కుట్టు మిషన్‌ను సైతం ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో ఈనెల 15 లోపు కలెక్టర్ చౌక్‌లోని న్యాక్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. వివరాలకు 93932 14465 సంప్రదించాలని సూచించారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి

బోథ్: సొనాల మండల కేంద్రంలో జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మండల వాసులు కోరుతున్నారు. జొన్న పంట చేతికి వచ్చిందని, మండలంలో పంట దిగుబడి అధికంగా ఉండటంతో సొనాలలోనే కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు పేర్కొంటున్నారు. దీంతో దూరాభారం తగ్గడంతో పాటు రవాణ ఖర్చులు కూడా ఆదా అవుతాయన్నారు.

గ్రామాల్లో పాదయాత్ర

ఇచ్చోడ: మండలంలోని దాబా(కే), బాదిగూడ, హీరాపూర్, బోజ్జుగూడ గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జై బాపు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కేంద్రంలో పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం మతతత్వ రాజకీయాలకు పాల్పడుతుందని గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు కుంర కోటేశ్వర్, నారయణ్‌రెడ్డి, ముస్తాఫా, లక్ష్మన్, చౌహన్ శేషారావు, గోవర్ధన్, షాదుల్లా పాల్గొన్నారు.

బాలుడిని ఢీకొట్టిన బైక్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని మసూద్‌చౌక్‌కు చెందిన అబ్దుల్ విఖార్ అనే ఐదేళ్ల బాలుడిని గుర్తు తెలియని బైక్ ఢీ కొటింది. ఈనెల 7న రాత్రి 7 గంటల సమయంలో కాలనీలో ఆడుకుంటున్న సమయంలో ఢీ కొట్టి పారిపోయాడు. దీంతో కుటుంబీకులు చికిత్స నిమిత్త రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. తలకు, కాలుకు తీవ్ర గాయాలు కావడంతో అదేరోజు రాత్రి హైదరాబాద్‌కు తరలించారు. గురువారం కుటుంబీకులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

వీడీసీలదే రాజ్యం..!



కొత్త గ్రామంలో పోలీసులు పట్టుకున్న మద్యం

- గ్రామాల్లో బెల్టుషాపులకు అనుమతులు
- పోలీసుల దాడులు, కేసులు నమోదు
- గ్రామాభివృద్ధి గాలికి.. వసూళ్లపైనే దృష్టి

బోథ్: మస్తుగా తాగండి.. ఫుల్ ఎంజాయ్ చేయండి.. సంసారాలు కూల్చుకోండి.. రోగాల బారిన పడండి.. ఇదీ పలు గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీల పేరిట వీడీసీలు చేస్తున్న నిర్వాకం. గ్రామాలను అభివృద్ధి బాటలో నడపాల్సిన వీడీసీలు గ్రామాల్లోకి మద్యాన్ని ఏరులై పారిస్తోంది. మద్యం అందుబాటులో ఉండటంతో మందుబా బులు తెగ తాగేస్తున్నారు. దీంతో గొడవలు, ఆరోగ్యం, ఆర్థికంగా నష్టపోవడం వంటివి జరుగుతున్నాయి.

అనధికారికంగా వేలం..

జిల్లాల్లోని గ్రామాల్లో మద్యం అమ్మేందుకు అనధికారికంగా వేలం నిర్వహిస్తున్నారు. వేలంలో బెల్టుషాపును దక్కించుకున్న వారికి సంవత్సరం పాటు అనుమతులు ఇస్తున్నారు. అధికారులను సైతం తామే మేనేజ్ చేస్తామని వేలం పాటలో బెల్టుషాపులు దక్కించుకున్న వారికి అభయం ఇస్తున్నారు. గ్రామాభివృద్ధి పేరిట గ్రామాల అభ్యున్నతికి పాటుపడాల్సిన గ్రామాభివృద్ధి కమిటీలు మద్యాన్ని పేద ప్రజల మద్యకు చేయడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో గ్రామాల్లో పేద ప్రజల జీవితాలు ఆగమాగం అవుతున్నాయి. జిల్లాలో నీరు దొరకని పల్లెలు ఉన్నాయి కానీ మద్యం దొరకని పల్లెలు లేవు. అక్రమ మద్యాన్ని అడ్డుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు మాత్రం తమకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

అధిక ధరలు..

బెల్టుషాపు నిర్వాహకులు క్వార్టర్‌పై రూ.15 నుంచి రూ. 20 వరకు అదనంగా తీసుకుంటున్నారు. రూ.100కు అమ్మాల్సిన బాటిల్‌పై రూ.120 వరకు తీసుకుంటున్నారు. బీర్లపై కూడా ఎమ్మార్పీ కంటే అదనంగా రూ.20 తీసుకుంటున్నారు. కొన్ని బెల్టు షాపులు ఏకంగా బార్లను తలపిస్తున్నాయి.

బెల్టు షాప్‌లపై దాడులు..

ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తరువాత వీడీసీలపై ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. ఈమేరకు ఎస్పీ ఆదేశాల మేరకు బోథ్ మండలంలో ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం కొత(బి), ధన్నూర్(బి) గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టుషాపులపై దాడులు నిర్వహించారు. ధన్నూర్(బి) గ్రామంలో బెల్టు షాపులో రూ.1,34,000 విలువైన 587 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో నిర్వాహకుడు రత్నపురం సాయనం, ఇద్దరు వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేశారు. కొత(బి) గ్రామంలో రూ. 90 వేల విలువైన 690 బాటిళ్లను పట్టుకున్నారు. నిర్వాహకులు శ్రీనివాస్ గౌడ్, జాదవ్ కృష్ణలతో పాటు ఇద్దరు వీడీసీ సభ్యులపై కేసులు నమోదు చేశారు.

వేలం వేస్తే చర్యలు



బెల్టుషాపుల కోసం గ్రామాభివృద్ధి కమిటీలు వేలం నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. వారిపై కేసులు నమోదు చేస్తాం. ఇసుక, మొరం క్వారీల వద్ద డబ్బులు వసూలు చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తాం. నిరంతరంగా బెల్టుషాపులపై దాడులు నిర్వహిస్తాం. గ్రామాల్లో అనధికార బెల్టుషాపులను మూసివేయాలి.

ఎల్. ప్రవీణ్ కుమార్, ఎస్సై, బోథ్

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న గజేందర్

నేరడిగొండ: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. గురువారం వడూర్ గ్రామంలోని మహాలక్ష్మి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు రవాణ సౌకర్యం కల్పించేందుకు రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, వడూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని హనుమాన్‌నగర్ ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. గురువారం ఆలయాన్ని సందర్శించిన ఆయన చేపట్టాల్సిన పనులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. దీంతో తక్షణమే ఆలయం చుట్టూ సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుందని అదే విధంగా వీలైనంత తర్వలో చుట్టూ ప్రహరీ, షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆడే గజేందర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఆడే శీలా, నాగ్‌నాథ్ అప్పా, మాధవ్ ససానే, కరాడ్ బ్రహ్మానంద్, రాందాస్ కాత్లే, సుశీల్, శ్రీకర్‌గౌడ్, సత్తయ్య సేట్, చందాపురే కైలాస్ పాల్గొన్నారు.

విద్యుత్ తీగలపై విరిగిపడిన చెట్టు

- నిలిచిన విద్యుత్ సరఫరా



విద్యుత్ తీగలపై పడిన చెట్టు

తాంసి: బుధవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉరుములు, మెరుపులతో కూడిన గాలి వీయడంతో భీంసరి గ్రామ సమీపంలో 33 కేవీ విద్యుత్ తీగలపై చెట్టు పడటంతో తాంసి, భీంపూర్ మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తాంసి, భీంపూర్ మండలాల్లోని సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో గ్రామాల్లో అంధకారం నెలకొంది. ఉదయం తాగునీటికి సైతం ఇబ్బందులు తప్పలేదు. తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన ఏఈలు మనోజ్, తిరుపతి రెడ్డి సిబ్బందితో కలిసి చెట్టును తొలగించి మరమ్మతులు చేపట్టారు.

జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: సన్నబియ్యం, రబీ పంట కోతలు పూర్తయిన సందర్భంగా నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి నిర్వహించిన జూమ్ మీటింగ్ లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం విజయవంతంగా పూర్తయిందన్నారు. రబీ పంట కోతలు పూర్తయిన సందర్భంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఆదిలాబాద్‌టౌన్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ అన్నారు. పోషణ పక్షోత్సవాలు కార్యక్రమంలో భాగంగా గురువారం మహాలక్ష్మివాడ 4,5 అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళలు, యువతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ పక్షోత్సవాల్లో భాగంగా ఈనెల 22 వరకు 15 రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళలు, చిన్నారులు ఆరోగ్యకరమైన పోషకాహారం తీసుకోవడంతో అనారోగ్యం బారిన పడకుండా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సుజాత, ఆశ కార్యకర్త కవిత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

విమల రణధివే సేవలు మరువలేనివి



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: విమల రణధివే సేవలు మరువలేనివని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో విమల రణధివే జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విమల అనేక ఉద్యమాల్లో పాల్గొని ప్రజల కోసం పోరాటాలు చేశారని గుర్తుచేశారు. మే 20న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆశన్న, కిరణ్, సునీత, మల్లేష్, చిన్నన్న, స్వామి, రత్నమాల, సుభద్ర, కళావతి, విజయ, సునీత పాల్గొన్నారు.

ఉదయాన్నే వెళ్లి...పనులు పర్యవేక్షించి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేశ్

బోథ్: బోథ్ మండల ప్రజా పరిషత్ అధికారి రమేశ్ మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను క్షేత్రస్థాయిల్లోకి వెళ్లి పర్యవేక్షిస్తున్నారు. ప్రతీరోజు ఉదయాన్నే గ్రామాల్లో నిర్వహించే పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడుతున్నారు. గురువారం మండలంలోని మారుమూల ఆదివాసీ గ్రామమైన నేరేడుపల్లెలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పర్యవేక్షించారు. కూలీలతో కలిసి ఉదయాన్నే ఆయన పనులు జరిగే చోటికి వెళ్లారు. వారితో కలిసి పనులు చేయించి, సేద తీరారు. నీటి కుంటల కొలతలను పరిశీలించారు. టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు పలు సూచనలు చేశారు.

బ్రిడ్జి నిర్మించాకే పనులు చేపట్టాలి



రైల్వే బ్రిడ్జి పనులు పరిశీలిస్తున్న అధికారులు

తలమడుగు: మండల కేంద్రంలోని స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే గేటు వద్ద నిర్మిస్తున్న అండర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని వాటిని పరిష్కరించాకే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని తలమడుగు గ్రామానికి చెందిన రైతులు గ్రామస్తులు ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కు, రైల్వేశాఖ అధికారులకు విన్నవించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రుయ్యాడి రైల్వే గేట్ వద్ద నిర్మాణం చేపడుతున్న అండర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం వల్ల నీరు నిల్వ ఉండి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామన్నారు. అంతే కాకుండా గ్రామ సమీపంలో మినీ అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టాలని రైల్వే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్ మోహన్, రైల్వే శాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదల నడ్డి విరుస్తున్న బీజేపీ



మాట్లాడుతున్న గంగయ్య

ఇచ్చోడ: కేంద్రంలోని బీజేపీ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తుందని సీపీఐ మండల కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న న్యాయవాది రోషిరెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎంప్లాయీస్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి న్యాయవాది టి.రోషిరెడ్డి రూ.21వేలు విరాళంగా అందించారు. గురువారం కాలనీ అధ్యక్షుడు విలాస్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు న్యాయవాదిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు విలాస్‌రెడ్డి, రామకృష్ణ, తమ్మల గంగన్న, రమేశ్, సాయి, ప్రవీణ్, ధర్మరాజు, అశోక్, గణేష్, శివ పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తాం

నేరడిగొండ: ఎవరైనా నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే వాటిని సీజ్ చేస్తామని నేరడిగొండ ఎస్సై శ్రీకాంత్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇప్పటి వరకు 9 వాహనాలు సీజ్ చేసి నంబర్ ప్లేట్ పెట్టించడం జరిగిందన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సిబ్బంది రాజశేఖర్, గణేశ్, పైలెట్ రవీందర్, బాబురావ్, అంజన్న పాల్గొన్నారు.

108 వాహనం తనిఖీ

ఉట్నూర్‌రూరల్: అత్యవసర సమయాల్లో 108 వాహనాన్ని ఎల్లావేళల ప్రజలకు అందుబాటులో ఉంచుతూ.. మెరుగైన సేవలు అందించాలని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రట్, కోఆర్డినేటర్ శేఖర్‌లు అన్నారు. మండల కేంద్రంలోని 108 వాహనాలను గురువారం అకస్మికంగా తనిఖీ చేశారు. రోడ్డు ప్రమాదాలు, గర్భిణులు, పాముకాటు ఎలాంటి అత్యవసరాలున్న ప్రజలు 108 సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వారి వెంట ఈఎంటీలు ఉన్నారు.

సన్న బియ్యం భోజనం చేసిన తహసీల్దార్



భోజనం చేస్తున్న తహసీల్దార్ శ్యాంసుందర్

బజార్‌హత్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదలకు రేషన్ షాపుల ద్వారా ఉచితంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. అందులో భాగంగా సన్నబియ్యంపై లబ్ధిదారుల అభిప్రాయ సేకరణ కోసం గురువారం తహసీల్దార్ శ్యాంసుందర్ మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో లబ్ధిదారుడు కైలాస్ ఇంటివద్ద సన్నబియ్యంతో వండిన వంటను కైలాస్ కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో నయాబ్ తహసీల్దార్ హీరాలాల్, సీనియర్ అసిస్టెంట్ విద్యాసాగర్‌రెడ్డి, ఆర్ఐ సూర్‌సింగ్, బాపురావ్, ఆశన్న, తదతరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం గడువు పొడిగించాలి



మాట్లాడుతున్న మనోజ్ మాదిగ

ఆదిలాబాద్‌రూరల్: రాజీవ్ యువ వికాసం పథకం గడువు ఈనెల 30 వరకు పొడిగించాలని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ మాదిగ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుద్యోగ యువత అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన పథకం చాలా గొప్పదన్నారు. దీని ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువత స్వయం ఉపాధి కల్పించుకొని అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆర్డీవో ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందడం లేదని, శని, ఆది, సోమవారాలు వరుసగా సెలవులు రావడంతో దరఖాస్తులు చేయలేని పరిస్థితి ఉందన్నారు. సమావేశంలో నాయకులు నక్క రాందాస్, లింగంపల్లి ప్రసన్న కుమార్, సంజయ్ షిండే, తదితరులు పాల్గొన్నారు.

మాభూమి రథయాత్ర విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

తలమడుగు: తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ, అగ్రవర్ణ పేదల రాజ్యస్థాపన కోసం విశారదన్ మహరాజ్ చేపట్టే లక్ష కిలో మీటర్ల మాభూమి రథయాత్రను విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గి మల్ల గణేష్ కోరారు. గురువారం మండలంలో రుయ్యాడి, సుంకిడి గ్రామాల్లో పర్యటించారు. అనంతరం మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఏప్రిల్ 14న ఆదిలాబాద్ డైట్ మైదానంలో బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అగ్రకులాల పేదలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగన్న, శివకుమార్, ప్రేమ్, గోవర్ధన్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలి



అధికారులతో సమావేశమైన ఎంపీడీవో

తలమడుగు: రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదల కోసం కొత్తగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. అదే విధంగా యువతకు ఉపాధి అవకాశాలను కొత్తగా ప్రారంభించిన రాజీవ్ యువ వికాస్ పథకంపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎంపీవో వినోద్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు వినోద్, శివకుమార్, అనిల్‌రెడ్డి, అజేయ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం కింద జిల్లాలోని నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మెప్మా డీఎంసీ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్, పాలిటెక్నిక్ డిప్లొమో, ఐటీఐ సర్టిఫికేట్, బీఏ, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీఫార్మా కలిగి ఉండి 21నుంచి 24 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. జిల్లాలోని ఆసక్తి గల యువతీ, యువకులు pminternship.mca.got.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గిరిజన విద్యపై ప్రత్యేక శ్రద్ధ

తలమడుగు: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. గురువారం గ్రామంలోని కప్పర్ దేవి, గిరిజన పాఠశాలను సందర్శించారు. గ్రామస్తులు పాఠశాలలోని నీటి సమస్య, ప్రహరీ సమస్య గురించి విన్నవించారు. పది రోజుల్లో బోరు వేయించి నీటి సమస్యని పరిష్కరిస్తామన్నారు. గిరిజన గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, మాజీ సర్పంచ్ జంగుబాయి, ఉపాధ్యాయులు ప్రఫుల్ చందర్ రెడ్డి, కోరంగుల శ్రీనివాస్, దినకర్, జయరాం, రావుల నారాయణ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

ఆదిలాబాద్‌టౌన్: డీఎస్సీ 2008 ద్వారా నియాకమైన కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్ము కృష్ణకుమార్, టి.నరసింహస్వామిలు అన్నారు. గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. రెండు నెలలు గడుస్తున్నా వేతనాలు ఇప్పటివరకు చెల్లించడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గోవర్ధన్, వినోద్ రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, బండి సుభాష్ పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణ



పూజలు చేస్తున్న భక్తులు

ఆదిలాబాద్‌రూరల్: అయ్యప్ప జన్మ దినోత్సవం సందర్భంగా ఉత్తర నక్షత్ర పూజలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం బెల్లూరి అయ్యప్ప ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సంతోష్ శర్మ గురుస్వామి ఉదయం 6.30 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యావాచనం, ఆలయ సంప్రోక్షణ, ధ్వజ రోహణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు ధారట్ల జీవన్ గురుస్వామి, ఆలయ ప్రధాన కార్యదర్శి దాముక రవీందర్ గురుస్వామి, టింగం నరేశ్, అనిల్, లక్ష్మణ్, శరత్ రెడ్డి, యువరాజ్, తదితరులు పాల్గొన్నారు.